ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 17 జూలై 2025

వరుణుడి రాక కోసం.. కప్ప కావడి

వర్షాలు లేక జనాలు అల్లాడుతున్నారు. వేసిన పంటలు ఎక్కడ వాడిపోతాయేమోనని రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. అంతా వరుణుడి రాకకోసం ఆకాశం వైపు చూస్తున్నారు. బుధవారం కడ్తాల మండల కేంద్రంలో మహిళలు కప్ప కావడి నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ దేవతలను వేడుకుంటూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రోకలికి కప్పను, యాప మండలను కట్టి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, నాయకులు సత్యనారాయణ, రాజు గౌడ్ పాల్గొన్నారు. - కడ్తాల్, జూలై 16(ఆంధ్రజ్యోతి)



ప్రకృతే పందిరిలా..

ఎండ తీవ్రతను తట్టుకోవడానికి చెట్ల కొమ్మలతో పందిరి వేసుకుని సేద తీరుతాం. అదే ప్రకృతే పందిరిగా మారితే ఎంతో సౌందర్యంగా ఉంటుంది కదూ.. మనుస్సుకు ఆహ్లాదాన్ని పంచుతున్న ఈ దృశ్యం షాద్‌నగర్ నియోజకవర్గంలోని రావిర్యాల - ఎదిర గ్రామాల మధ్య కనిపించింది. రోడ్డుకు ఇరు వైపుల నాటిన మొక్కలు చెట్లుగా మారి అల్లుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతూ వాహనదారులను మైమరిపిస్తున్నాయి.

- షాద్‌నగర్ అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి)



కడ్తాల్‌లో కప్పకావడి ఆడుతున్న గ్రామస్తులు



స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సునితారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు

ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

యాచారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్దలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించడానికి బుధవారం స్థలాన్ని మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజులు పరిశీలించారు. ఇక్కడ భవనం నిర్మిస్తే కందుకూరు, యాచారం మండలాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందా అని ఏసీపీ రాజును అడిగి తెలుసుకున్నారు. కుర్మిద్దలోని 311 సర్వే నంబర్‌లోని మూడెకరాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించడానికి స్థలం అనువుగా ఉంటుందని ఏసీపీ రాజు డీసీపీకి వివరించారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ నిర్మించడానికి స్థలం కోసం మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబుకు ప్రతిపాదనలు పంపించారు. మంత్రి అనుమతి రాగానే భవనం నిర్మించడానికి రాచకొండ పోలీస్ అధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గురువారం మేడిపల్లిలో అద్దె భవనంలో స్టేషన్ కొనసాగుతుంది. మేడిపల్లికి వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుర్మిద్దలో సీఐ లి క్కి కృష్ణంరాజు, ఎస్సై తేజం రెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపొద్దని పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

నాణ్యమైన విద్య అందించాలి

» జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు

శంకర్‌పల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు అన్నారు. జన్వాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి మెరుగైన విద్యనందించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా బోధన అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చేపపిల్లల జాడేది?

చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు కమ్ముకున్నాయి. చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు ఏటా మే నెలలోనే టెండర్లు పిలిచేవారు. ఈ ఏడాది జూలై మధ్యలోకి వచ్చినా ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. సీజన్ దాటితే చేప పిల్లలు పెరగవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సైతం ఆలస్యంగా చేప పిల్లలను వదలడంతో అవి ఎదగక తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది సరిగా వర్షాలు లేక చెరువుల్లో నీళ్లు చేరలేదు. అయినా ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. దీంతో ఈ పథకం అమలుపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.





- ఈ ఏడాది పథకం కొనసాగింపుపై సందేహాలు
- అదును దాటితే చేపలు ఎదగడం కష్టమే..
- గతేడాది ఆలస్యంగా చెరువుల్లోకి చేప పిల్లలు
- తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులు

త్వరగా చేప పిల్లలను వదలాలి



చెరువుల్లో త్వరగా చేప పిల్లలను పంపిణీ చేయాలి. ఏటా సీజన్ దాటి పోయాక చేప విత్తనాలను అందిస్తున్నారు. దీంతో చేపలు ఎదగడం లేదు. ప్రభుత్వం ఇచ్చే సీడ్ నాసిరకంగా ఉంటుంది. చేప పిల్లల పంపిణీకి బదులుగా మత్స్య సహకార సంఘాలకు నగదను బదిలీ చేయాలి. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కొర్రమీను పంపిణీ చేయాలి.

- శ్రీనివాస్ ముదిరాజ్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

పంపిణీపై స్పష్టత కరువు

రంగారెడ్డి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 8,221 మత్స్యకారుల కుటుంబాలు ఉన్నాయి. జిల్లాలో 120 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 978 చెరువులు మత్స్యశాఖ ఆధీనంలో 7,297 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. 2016-17 సంవత్సరంలో చేప పిల్లల సంఖ్య 25 లక్షలు ఉండగా 2023-24 సంవత్సరం నాటికి 100 శాతం గ్రాంట్స్‌పై 799 చెరువుల్లో 162.35 లక్షల చేప పిల్లలను వదిలారు. ప్రతి సంవత్సరం జూలైలో చేప పిల్లల పంపిణీ చేయాల్సి ఉండగా మూడు నెలలు ఆలస్యంగా వదులుతున్నారు. దీంతో చెరువుల్లో నీటి మట్టం తగ్గి చేపలు ఎదగడం లేదని వాపోతున్నారు.

ఉచితంలో చేర్చని కొర్రమట్ట..!

జిల్లాలో ఏటా సుమారు 1.62 కోట్ల చేప పిల్లలను ఉచితంగా రాష్ట్ర మత్స్యశాఖ పంపిణీ చేస్తున్నది. డిమాండ్ ఎక్కువగా

మిగతా 8వ పేజీలో...

చేప పిల్లల పంపిణీ ఇలా..

సంవత్సరం	పంపిణీ (లక్షల్లో)	ఖర్చు (లక్షల్లో)
2016	10.10	18
2017	99.74	63.10
2018	27.69	21.54
2019	70.54	33.06
2020	129.05	70.23
2021	163.13	117.19
2022	163.13	117.19
2023	162.35	114.60
2024	1.93	-

భూ సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతులు ఏళ్లగా భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యలు తీర్చాలని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి యాచారం తహసీల్దార్ అయ్యప్పను ఆదేశించారు. బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలతో కార్యాలయానికి వచ్చినరైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా మంది రైతులు కాస్తులో ఉన్నా(ఎల్‌ఆర్‌యూపీ) ల్యాండ్ రికార్ట్స్ అప్‌డేషన్ ప్రోగ్రాంలో రెవెన్యూ సిబ్బంది పట్టా భూములను భూదాన్ భూములుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్‌ఆర్‌యూపీలో భూదాన్ బోర్డు నుంచి ఆ భూములు తమవని గెజిట్ వచ్చిందన్నారు. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి రికార్డులను సరి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు.

అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలి

» ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ జ్యోత్స్నారాణి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్నారాణి

వికారాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల పెంపునకు ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోత్స్నారాణి సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జరిగిన ప్రిన్సిపాళ్ల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రిన్సిపాళ్లు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ వంటి సంస్థల ద్వారా ఎప్సెట్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలల మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాళ్లతో చర్చించారు. ఇటీవల జిల్లాలో నూతనంగా నియమితులైన ప్రిన్సిపాళ్లు రోజారాణి, వసంత, రవణకుమారిలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రూపాలక్ష్మి, నర్సింహారెడ్డి, కుమారస్వామి, బుచ్చిరెడ్డి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వర్ రావు, సిబ్బంది మల్లినాథప్ప, పండరి, మక్బుల్, వినోద్, సలీమాబేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.


భూ సమస్యలకు పరిష్కారమెప్పుడో?
రెవెన్యూ సదస్సుల్లో రైతుల విన్నపాలు
యాచారంలో పరిధిలో 2,057 దరఖాస్తులు
7

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

7

మొక్కలు నాటి సంరక్షించాలి
ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
7

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు



- రంగారెడ్డి జిల్లాలో జెడ్పీటీసీలు 21 ఎంపీటీసీలు 230
- వికారాబాద్‌లో ఎంపీటీసీలు 227, జెడ్పీటీసీలు 20

రంగారెడ్డి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక పోరుకు రంగం సిద్ధమవుతోంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ స్థానాలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మేడ్చల్ జిల్లాలోని అన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో అక్కడ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు లేకుండా పోయాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో రెండు జెడ్పీపీ స్థానాలు, 41 జెడ్పీటీసీ స్థానాలు, 41 ఎంపీపీ స్థానాలు, 457 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. కాగా, రంగారెడ్డి జిల్లాలో 21 జెడ్పీటీసీలు, 21 ఎంపీపీలు, 230 ఎంపీటీసీ స్థానాలు, వికారాబాద్ జిల్లాలో 20 జెడ్పీటీసీ, 20 ఎంపీపీపీ, 227 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది.

నేటి నుంచి మహిళా శక్తి సంబరాలు

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆరు నియోజకవర్గాల్లో 16,027 సంఘాలకు రూ.16.09 కోట్లు వడ్డీ లేని రుణాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 17న చేవెళ్ల నియోజకవర్గంలో 3,441 సంఘాలకు 3.58 కోట్లు, 18న మహేశ్వరంలో 2,134 పొదుపు సంఘాలకు 2.09 కోట్లు, ఈనెల 19న కల్వకుర్తిలో 2,409 సంఘాలకు రూ.2.30 కోట్లు వడ్డీలేని రుణాలను అందచేయనున్నట్లు వివరించారు. ఈనెల 21న ఇబ్రహీంపట్నంలో 3,642 సంఘాలకు 3.93 కోట్లు, ఈనెల 22న షాద్‌నగర్‌లో 3,418 సంఘాలకు 3.29 కోట్లు, ఈనెల 19న రాజేంద్రనగర్‌లో 983 సంఘాలకు 0.90 కోట్లు వడ్డీ లేని రుణాలను అందజేస్తామన్నారు.

విస్తరణ వేగం.. ప్రగతికి దూరం

- లోపించిన పారిశుధ్యం..
- అంతర్గత రోడ్లు అధ్వానం
- అందని మిషన్ భగీరథ తాగునీరు
- హామీలకే పరిమితమైన నేతల హామీలు

విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కరువు

ఆమనగల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): వేగంగా విస్తరిస్తున్న ఆమనగల్లు మున్సిపాలిటీలోని 9వ వార్డు విద్యానగర్ కాలనీ అభివృద్ధిలో మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. నగర శివారు ప్రాంతాలకు దీటుగా ఇక్కడ ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా అందుకనుగుణంగా మౌలిక వసతులు మాత్రం ఒనగూరలేదు. కాలనీలో నెలకొన్న సమస్యలతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వసతుల కల్పనకు పాలక ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏళ్లకాలంగా మున్సిపాలిటీపై ఒత్తిడి తెస్తున్నా స్పందన లేదని వాపోతున్నారు.

250 కుటుంబాలు.. 1250 జనాభా

ఆమనగల్లు పట్టణంలోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న విద్యానగర్‌కాలనీలో 250 కుటుంబాలు, సుమారు 1500జనాభా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎస్సీ హాస్టల్ వరకు ఈ కాలనీ విస్తరించి ఉంది. ఈ కాలనీ మీదుగానే వేంకటేశ్వర స్వామి, కన్యకాపరమేశ్వరి దేవాలయాలు, పాఠశాల, ధ్యాన కేంద్రం, పలువురు రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్తుంటారు. అయితే విద్యానగర్ కాలనీలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి. ప్రధానంగా పారిశుధ్యం పూర్తిగా కొరవడింది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు ముసురుతున్నాయి. మురుగు కాల్వలు

మిగతా 8వ పేజీలో...



అంతర్గత రోడ్డుపై నిలిచిన వర్షం నీరు(ఫైల్)

మౌలిక వసతులు కల్పించాలి



విద్యానగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలి. మౌళిక వసతుల కల్పనలో మున్సిపాలిటీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి. మిషన్ భగరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు అందించాలి. ఇళ్ల మధ్య నుంచి ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించాలి.

- ఎంఏ. పాషా, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, విద్యానగర్ కాలనీ







ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

దౌల్తాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేవరపస్లాబాద్ రైతు వేదికలో బుధవారం ఉద్యానశాఖ అధికారులు రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. అధికారి రంగనాయకులు ఆయిల్‌పామ్ ప్రాముఖ్యం, శాస్త్రీయ విధానాలు, కలిగే లాభాలపై వివరించారు. ఆయిల్‌పామ్ సాగు రైతులకు శాశ్వత ఆదాయ వనరుగా మారుతుందన్నారు.సురేంద్రనాథ్, సత్తార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారులు







పచ్చని తెలంగాణే లక్ష్యం


కార్యక్రమం లో మట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మొక్కలునాటి..సంరక్షించి భావితరాలకు పచ్చదనాన్ని, వృక్షఫలాలను అందిద్దామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కాశీంపూర్‌లో ఎక్సైజ్, అటవీశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై మధుసూదన్‌గౌడ్‌కు చెందిన ఎకరాభూమిలో ఈత మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ.. గౌడవృత్తినికాపాడేందుకు ప్రభుత్వ భూముల్లో ఈత మొక్కలను నాటుతాం అన్నారు. కార్యక్రమంలో అబ్కారీశాఖ జిల్లా అధికారి విజయ్ భాస్కర్‌గౌడ్, ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ షాహిదాబేగం, ఎంపీడీవో విజయ్‌కుమార్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ కాశప్ప, శ్రీదేవిసరస్వతి, స్నేహశ్రీ నాయకుడు దుశ్యంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎవరికీ లంచాలివ్వొద్దు

సంక్షేమ పథకాల కోసం ఎవరికీ నయా పైసా లంచం ఇవ్వొద్దని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఎక్మాయిలో పుప్పలి అలివేలుకు మంజూరైన ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు అందరికీ వస్తాయని, తమకు రాలేదని ఎవరూ దిగులుపడొద్దన్నారు. అంతకు ముందు రూ.10లక్షలతో చేపట్టే రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

పరిగి,జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా సంఘాలకు రూ.11.11కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు, అద్దె ఆర్టీసీ బస్సుల నిర్వహణ తదితర అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో కొత్తగా 5,143 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపుపీడీ నర్సింహులు, తహసీలార్లు వెంకటేశ్వరి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రతీ గ్రామానికి రోడ్డు వేస్తాం

పూడూరు: ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం చిట్టెంపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు రూ.20కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తండాల అనుసంధానానికి లింక్ రోడ్లు వేస్తామన్నారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డును నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు.


అవుశాపూర్‌లో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

విధిగా మొక్కలు నాటాలి

ఘట్‌కేసర్‌రూరల్; జూలై 16(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడమే కాదు.. అవి వృక్షాలుగా ఎదిగేలా సంరక్షిస్తేనే వన మహోత్సవ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. ఘట్‌కేసర్ పరిధి అవుశాపూర్‌లో బుధవారం ఆమె మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేష్, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, జంగయ్య, ఎ.మశ్చేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అవుశాపూర్‌లో నీటిసమస్య తీవ్రంగా ఉందని, గోదావరి నీరు రావడం లేదని గ్రామస్తుడు మశ్చేందర్‌రెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రోజుకు పదిసార్లు కరెంటు పోతోందని తెలిపారు. సాగుకు నీరు సరిపోవడం లేదని, గృహాల్లోనూ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మూడుచింతలపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి లక్ష్మాపూర్‌తండాకు తాగునీరు సరఫరా కావడంలేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం అన్నారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజులుగా తండాకు మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. తండా వాసులు తాగునీటిని వ్యవసాయ బోర్ల నుంచి తెచ్చుకుంటున్నారని తెలిపారు.

మానవతను నేర్పించడం గురుతర బాధ్యత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, భాస్కరయోగి

పరిగి,జూలై 16(ఆంధ్రజ్యోతి): మానవతా విలువలను నేర్పించడమే గురుతర బాధ్యత అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి ఆధ్వర్యంలో బుధవారం పరిగిలోని జరిగిన గురుపౌర్ణమి వేడుకలో పాల్గొని మాట్లాడారు. గురువు మార్గదర్శకుడన్నారు. మంచి, చెడులను గుర్తించి సన్మార్గంలో పయనించేలా దారి చూపేది గురువని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రజలు దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

చండీ యాగానికి తరలిన అర్చకులు


చండీ యాగంలో వాసుదేవశర్మ, అర్చకులు

కొడంగల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో తలపెట్టిన చండీ కుబేర పాశుపత యాగానికి కొడంగల్ నుంచి అర్చకులు తరలివెళ్లారు. అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి యాగశాలలో దేవతామూర్తులను దర్శించుకున్నారని జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థ చారి తెలిపారు. నటరాజ్, అఖిలేశ్, జగదీశ్, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

దుద్యాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి 8వ వార్డులో పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో

మర్పల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలకు ప్రత్యేకాధికారి వద్దంటూ విద్యార్థినులు ఆదివారం ఆందోళన చేశారు. దీంతో బుధవారం డీఈవో రేణుకాదేవి పాఠశాలను తనిఖీ చేశారు. స్కూలులో జరిగిన సంఘటనపై ఆమె ఆరా తీశారు. బాలికలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలోకి విలేకరులకు అనుమతివ్వకుండా అంతర్గతంగా విచారణ చేయడం గమనార్హం.

తాండూరులో హస్తకళల ఎగ్జిబిషన్


తాండూరులో హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లు

తాండూరు,జూలై16(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్ స్టాళ్లను తాండూరులో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల కళాకారులు తయారు చేసిన వస్తువులను 60శాతం సబ్సిడీపై అమ్ముతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ఎంబ్రాయిడరీ, ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ చీరలు, గద్వాల్, నారాయణపేట్, పోచంపల్లి, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్ విక్రయిస్తున్నారు.

వానల కోసం జలాభిషేకం


పట్లూర్‌లో వరదపాశంపోసేందుకు వెళ్తున్న గ్రామస్తులు

మర్పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడు కరుణించడం లేదని పట్లూర్‌లో బుధవారం సోమేశ్వరాలయంలో గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పూజలు చేశారు. భజనలతో ఆలయ ఆవరణలో వరదపాశం పోశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని ప్రజలు కోరుకున్నారు.

జుంటువాగు కబ్జాపై అధికారుల సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ రోడ్డులోని జుంటువాగుకబ్జాపై తాండూరు ఇరిగేషన్ డీఈఈ శిరీష, ఏఈ సాయి, రెవెన్యూ గోపి, సర్వేయర్ మహేశ్ బుధవారం రెండోసారి సర్వే చేశారు. మ్యాప్‌ను పరిశీలిస్తూ హద్దులను గుర్తించారు. వారం కిందట యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య సర్వే చేయించి 5మీటర్ల వెడల్పు, 200మీటర్ల పొడవున వాగును కబ్జా చేశారని తేల్చి హద్దులు పాతారు. అయితే సాగు భూమిలో గదుల నిర్మాణ ప్రాంతం తాండూరు మండల పరిధికి వస్తుందని, ప్రభుత్వ భూమిగా మ్యాప్‌లో చూపుతోందని వెల్లడించారు. ఈ క్రమంలో మరోసారి సర్వే చేసిన అధికారులు వాగు కబ్జా పరిధి యలాల మండలంలో ఉందని నిర్ధారించారు. భూ యజమాని పొలం అర ఎకరం మాత్రం తాండూరు పరిధికి వస్తుందని నిర్ధారించారు. గదుల నిర్మాణ ఏరియాపై పట్టాపాసు పుస్తకాలను పరిశీలిస్తామని అన్నారు. అధికారుల వీరి వెంట వర్క్‌ఇన్స్‌పెక్టర్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

మంచాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మంచాలలో బుధవారం ఆయన వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో ముచ్చటించి సమాజంలో నెలకొన్న నేరప్రవృత్తిపై అవగాహన కల్పించారు. అపరిచిత వక్తులతో వాట్సాప్, వీడియోకాల్స్ మాట్లాడవద్దని, చిన్నారులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని తలిదండ్రులకు సూచించారు. యువతీయువకులు ఆన్‌లైన్ గేమింగ్, మత్తుపదార్థాలు, తదితర వ్యవనాలకు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మంచాల సీఐ మధు, ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కేపీవీ రాజు

రీజియన్‌లో ఆర్టీసీని లాభాల్లోకి తెస్తాం

» ఆర్‌ఎం శ్రీలత

తాండూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రీజియన్ పరిధిలో ఆర్టీసీ నష్టాల్లో ఉందని, సంస్థను లాభాల్లోకి తెచ్చే చర్యలు చేపడుతున్నామని రీజినల్ మేనేజర్ శ్రీలత చెప్పారు. బుధవారం తాండూరు డిపోలో ఆమె మాట్లాడారు. పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీలతో సర్వీసులు నడుపుతున్నామన్నారు. తాండూరు-మహబూబ్‌నగర్ రూట్లో సర్వీసులను పెంచామని, వికారాబాద్-సంగారెడ్డి రూట్లో బస్సులు నడుపుతున్నామని చెప్పారు. తాండూరు-బీదర్‌కు సర్వీస్‌ను నడిపేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే తాండూరు ఆర్టీసీ డిపోలో రీజినల్ మేనేజర్ శ్రీలతఉద్యోగులు, సిబ్బందితో సమీక్షించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. ప్రయాణికుల రద్దీ ఉండే రూట్లలో బస్సు సర్వీసులను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో డీవీ ఆర్‌ఎం సరస్వతి, మెకానికల్ ఆర్‌ఎం సుగుణాకర్, తాండూరు డీఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ మోహన్

కడ్తాల్, జూలై 16(ఆంధ్ర జ్యోతి): విద్యుత్, లో-వోల్టేజీ సమస్యలను పరిష్కరించి రైతులు, వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ముందుకు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ డీఎస్ మోహన్ తెలిపారు. కడ్తాల మండలం మక్తమాదారంలో బుధవారం ఎస్ఈ పర్యటించారు. ఏడీఈ బాలకృష్ణారావు, ఏఈ నరేందర్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి మాదారం, పరిసర ప్రాంతాల రైతులతో సమావేశమయ్యారు. పలువురు రైతులు తమ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. మాదారం నుంచి కడ్తాల వరకు 33 కేవీ ఇంటర్ లింకింగ్‌లైన్ పనులు వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఎస్ఈ ఆదేశించారు. విద్యుత్ పిర్యాదులపై అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. మక్తమాదారంలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని ఎస్ఈ పరిశీలించారు. నిర్మాణం పనులు త్వరలో ప్రారంబించడం జరుగుతుందన్నారు. ఏఈలు నరేందర్, విజయ్, కాంట్రాక్టర్ కృష్ణయ్య, నాయకులు బాల్‌రాజ్, షాబోద్దీన్, తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

శంషాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ నేతృత్వంలో బుధవారం శంషాబాద్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించక పోవడం సిగ్గుచేటన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శ్రీకాంత్, చరణ్, వరుణ్ వంశీ, తరంగ్, విప్లవ్, హర్ష, తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు అందిస్తున్న ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్

రైతులకు మేలు చేయడమే లక్ష్యం

మొయినాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్కెపల్లి రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్కెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 180లో గల భూమిని ప్రభుత్వం గోశాల ఏర్పాటు కోసం తీసుకుంటుండగా.. ఆరు కుటుంబాలకు చెందిన 16 మంది రైతులకు ఎకరానికి 300 గజాల చొప్పున కేటాయించారు. ఈమేరకు వారికి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ కాపీలు వారు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరాకు మూడు వందల గజాల స్థలం ఇస్తున్నట్లు చెప్పారు. దళారుల మాటలు నమ్మకుండా మిగతా రైతులు కూడా ముందుకొచ్చి పట్టాలు తీసుకోవాలని సూచించారు. రైతుల కుటుంబాల నుంచి ఒకరికి అవుట్ సోర్సింగ్ జాబ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, అధికారులు పాల్గొన్నారు.


రాజేందర్‌యాదవ్‌కు గులాబీ కండువా కప్పుతున్న దశరథ్ నాయక్

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

కడ్తాల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన మర్ల రాజేందర్ యాదవ్ బుధవారం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. మాజీ సర్పంచ్‌లు సులోచన సాయిలు, భాగ్యమ్మ జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జలీల్, చందు, సోమ్లు, కిషన్, జగన్, రాజేశ్, శ్రీకాంత్, లచ్చిరామ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు

మొయినాబాద్ రూరల్, జూలై 16(ఆంధ్యజ్యోతి): ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు ఉంటాయని మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్ హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లోని సర్వేనంబర్ 176లో గల దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ నిర్మాణ పనులను బుధవారం మొయినాబాద్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. 10 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నించగా అధికారులు ఫెన్సింగ్‌ను తొలగించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

షాద్‌నగర్ అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్న పేదలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 34మందికి బుధవారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో చెక్కులను, ఎల్‌వోసీలను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు శేఖర్ పంతులు, యారం శేఖర్‌రెడ్డి, యాదగిరి రావు, రామకృష్ణ, బాబురావు, మధుసూదన్ రావు, బాల్‌రాజుగౌడ్, శ్రీశైలం, గోపాల్‌గౌడ్, మధుసూదన్‌రావు, ఆంజనేయులు, నరేందర్, ఆనంద్‌యాదవ్, రెడ్యానాయక్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని సెంగెంలో బుధవారం పోచమ్మ, భువనేశ్వరి, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, వీరేశ్, జగదీశ్వరప్ప, రాణి, అనసూయమ్మ పల్లె ఆనంద్ కుమార్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, వై.గిరిధర్‌యాదవ్, రూప్లానాయక్, అంజయ్య, కరుణాకర్‌రెడ్డి, ఇబ్రహీం, తైద పర్వతాలు, నాగేష్, శ్రీనాథ్, అఖిల్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు. కాగా, గ్రామానికి చెందిన రాఘవేందర్, సరేష్, నర్సింగ్, వెంకటేష్ దంపతులు హోమం నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇదిలా ఉంటే, గ్రామానికి చెందిన కొందరు మహిళలు ఎమ్మెల్యే కలిశారు. తమకు ఇళ్లు ఇప్పించాలని కోరారు. కొంతమందికి స్థలం కూడా లేదని తెలిపారు. దాంతో అర్హులందరికీ ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. స్థలాలు చూపిస్తే ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగెం మహిళల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకుడు ఇబ్రహీంను ఆదేశించారు.

భూ సమస్యలకు పరిష్కారమెప్పుడో?

రెవెన్యూ సదస్సుల్లో రైతుల విన్నపాలు.. ● యాచారంలో పరిధిలో 2,057 దరఖాస్తులు


చింతపట్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు (ఫైల్)

యాచారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ఇటీవల అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కానీ, సమస్యలు నెరవేర్చడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు గ్రామాలలో పర్యటించి వాస్తవాలు విచారించకుండా ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం(ఎల్ఆర్‌యూపీ) ఆధారంగా పట్టా భూములను భూదాన్ భూములుగా నమోదు చేయడం దారుణమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టా భూమి భూదాన్ భూమిగా నమోదైతే ఆర్ఐ, సర్వేయర్ల చేత విచారణ చేయకుండా ఎల్ఆర్‌యూపీ కింద భావించి రెవెన్యూ అధికారులు రైతులకు తీవ్ర అన్యాయం చేశారని రైతులు మండిపడుతున్నారు. పట్టాభూమి భూదాన్ భూమిగా నమోదు కావడంతో తమ అవసరాల కోసం క్రయ విక్రయాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. మ్యుటేషన్, టీఎం 33, ఆన్‌లైన్‌లో రికార్డులను నమోదు చేయడం, గ్రామకంఠం భూములను గుర్తించి పంచాయతీకి అప్పగించాలని తదితర డిమాండ్లతో 2057 దరఖాస్తులను రెవెన్యూ అధికారులు రైతుల నుంచి స్వీకరించారు. కాగా, సదస్సులు ముగిసి నెల రోజులు దాటినా ఏ ఒక్క సమస్యనూ అధికారులు నెరవేర్చలేకపోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంతన్‌గౌరెల్లిలో గ్రామకంఠం భూమి సర్వే చేసి పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పట్టా సర్టిఫికెట్లు అందించాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఫార్మాసిటీ పరిధి గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో నిషేధిత జాబితాలో ఉన్న 2,500 ఎకరాల పట్టా భూములను రైతుల పేరిట నమోదు చేయాలని దరఖాస్తు చేసినా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని రైతులు చెబుతున్నారు.

పట్టా భూమిని భూదాన్ భూమిగా నమోదు చేశారు



తనకు గ్రామంలోని 386 సర్వే నెంబర్‌లో 2ఎకరాల 32 గుంటల పట్టా భూమి ఉంది. అధికారులు భూదాన్ భూమిగా నమోదు చేసి అన్యాయం చేశారు. మా తండ్రి నుంచి బి(2327/99), బి/4216/02 ప్రకారం భూమిని కొనుగోలు చేశా. పట్టాభూమి అని రెవెన్యూ అధికారులు ఎందుకు గమనించలేదో అర్థమైతలేదు. మా భూమి భూదాన్‌భూమిగా నమోదు చేసి అన్యాయం చేశారు. నాకు తగిన న్యాయం చేయాలి.

- పాల పెద్దమ్మ, గాండ్లగూడ

ఫిర్యాదులను ఆన్‌లైన్ చేస్తున్నాం



రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులను ఆన్‌లైన్ చేస్తున్నాం. ఎల్ఆర్‌యూపీ ఆధారంగా భూదాన్‌భూమిగా నమోదైన భూములు పట్టాభూములైతే.. భూదాన్ బోర్డు నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ తెచ్చుకుంటే రికార్డులను సరిచేస్తాం. తాము కావాలని ఏ ఒక్క రైతుకు అన్యాయం చేయలేదు. రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటివి కలెక్టర్, ఆర్డీవో దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- టి.అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

ఎల్ఆర్‌యూపీతో రైతులకు అన్యాయం



ఎల్ఆర్‌యూపీ(ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం)ను భగవద్గీతగా నమ్మి అధికారులు రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో, భూదాన్ బోర్డు అధికారులతో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెవెన్యూ అధికారులు గ్రామాలలో విచారణ చేసి పట్టాభూమి భూదాన్‌భూమిగా నమోదైతే పట్టాభూమిగా రికార్డులు నమోదు చేయాల్సింది.

- ఎం.కోదండరెడ్డి, రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్


పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్న పోలీసులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


కంటైనర్‌లో పశువులు

కడ్తాల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 105 పశువులను పోలీసులు పట్టుకున్నారు. కడ్తాల్ టోల్ గేటు దగ్గర బుధవారం ఈ సంఘటన జరిగింది. స్థానిక సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీ 29 టీబీ 3545 నెంబరు గల కంటైనర్‌లో పశువులను తరలిస్తుండగా పోలీసులు ఆపి విచారించగా అనుమతులు లేవు. దీంతో కామధేను సమర్థ గోశాల జియాగూడలో సేఫ్ కస్టడీ నిమిత్తం అప్పగించారు. అందులో 105 పశువులు ఉండగా.. 64 ఆవులు, 41 ఎద్దులు ఉన్నాయి. అందులో ఓ ఎద్దు, నాలుగు ఆవులు చనిపోయినట్లు గుర్తించారు. యజమాని ఎండీ తాలీమ్, డ్రైవర్ మహ్మద్ జాఫర్, ఖురేషి, లేబర్‌లు సర్ఫరాజ్, చాంద్, దర్శనం, కృష్ణలపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శోభారాణి

షాద్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తే ఫార్మసీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జేఎన్‌టీయూ ఫార్మా విభాగం అధిపతి ప్రొఫెసర్ శోభారాణి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ పరిధిలోని న్యాక్ గుర్తింపు పొందిన మూన్‌రే ఫార్మా కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ఎమ్‌పీఎస్‌సీవో సదస్సును ఆమె ప్రారంభించి ప్రసంగించారు. వైద్య రంగంలో ఫార్మా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఫార్మసీ విద్య పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు తమ కళాశాలలో ఉన్న ఫార్మసీ కోర్సులతో పాటు త్వరలోనే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సదస్సులో కళాశాల డైరెక్టర్ కె.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


చేవెళ్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పచ్చని తెలంగాణే లక్ష్యంగా వన మహోత్సవానికి శ్రీకారం చుట్టామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మోడల్ కాలనీ, మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పాండుయాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

» డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు

షాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు అన్నారు. షాబాద్ పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలింతకి వైద్య పరీక్షలు చేశారు. డెలివరీ కేసులు ఎన్ని వస్తున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, లేనిచో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట జూనియర్ అసిస్టెంట్ శ్యాంరావు, వైద్య సిబ్బంది సౌజన్య, మంజుల, శ్రీధర్ ఉన్నారు.


బాలేశ్వర్‌గుప్తాను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా ఎలక్షన్ కన్వీనర్‌గా బాలేశ్వర్‌గుప్తా

» నియమించిన పార్టీ అధిష్ఠానం



యాలాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాకు బీజేపీ రాష్ట్ర అధిష్ఠానం ఉత్తమ గుర్తింపునిచ్చింది. ఆయనను పార్టీ వికారాబాద్ జిల్లా ఎలెక్షన్ కన్వీనర్‌గా నియమించింది. బాలేశ్వర్‌గుప్తాకు జిల్లా ఎలెక్షన్ కన్వీనర్‌గా నియమించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బాలేశ్వర్‌గుప్తా సర్పంచ్‌గా, ఎంపీపీగా, ప్యాక్స్ చైర్మన్‌గా ప్రజలకు సేవలందించారు. బీజేపీలో చురుకైన పాత్రపోషిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా బాలేశ్వర్‌గుప్తా మాట్లాడుతూ.. తనకు జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని చెప్పారు. బాధ్యతను కట్టబెట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలేశ్వర్‌గుప్తాకు నాయకుల సన్మానం

తాండూరు: బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా నియమితులైన బాలేశ్వర్ గుప్తాను బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాలి శివకుమార్, పార్టీ యువ నాయకుడు పటేల్ విజయ్‌కుమార్, నాయకులు మురళీకృష్ణ, సుదర్శన్‌గౌడ్, సాయిరెడ్డి, శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

» ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

శంకర్‌పల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వర్షపు చినుకులు పడగానే రైతుబంధు డబ్బులు పడేవని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. జన్వాడలో బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. కేసీఆర్‌ను విమర్శించకుండా కాంగ్రెస్ నాయకులు సభలు, సమావేశాలు పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు సరిపోక.. లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ నారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్లు రాజునాయక్, మాణిక్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటేష్. మాజీ సర్పంచులు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, సత్యనారాయణరెడ్డి. మాజీ ఎంపీటీసీలు సురేందర్‌రెడ్డి, నాగేందర్. నాయకులు తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయండి

ఇబ్రహీంపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య సేవలను విస్తరించాలని ఇబ్రహీంపట్నం మండల బీజేపీ కమిటీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ముత్యాల మహేందర్ మాట్లాడుతూ 30 పడకలతో ఉన్న ఆసుపత్రిలో సిబ్బంది, సౌకర్యాల కొరత ఉందన్నారు. వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ 24 గంటలు వైద్య సేవలు అందేలా చూడాలని కమిషనర్‌ను కోరినట్ల తెలిపారు. బీజేపీ నాయకులు ఆడెపు రాఘవేందర్, విజయ్‌కుమార్, అనిల్, సంతోష్ తదితరులున్నారు.

ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో అవగాహన పెంచుకోవాలి

చేవెళ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో అవగాహన పెంచుకోవాలని ఎన్ఏసీ(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్-హైదరాబాద్) అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య, ప్రసాద్, శాస్త్రి, చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలతలు తెలిపారు. బుధవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఏసీ, స్పేస్ అకాడమీ-హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కన్‌స్ట్రక్షన్, ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యా రంగాల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అధ్యాపకులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ పై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండల కేంద్రంతో పాటు గ్రామాలలో కలాం ఎక్సలెన్స్ ఆఫ్ ట్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ తెలిపారు. ఏదైనా డిగ్రీ కలిగి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు సొంత గ్రామాలలో కలాం ట్యూషన్ కో-ఆర్డినేటర్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తులు అందజేస్తే 25న కల్వకుర్తి అక్షర వనంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట

తలకొండపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి అన్నారు. వెల్జాలకు చెందిన ఈశ్వరీ బాయికి రూ.45,500 సీఎంఆర్‌ఎఫ్ మంజూరైంది. బుధవారం బాధిత కుటుంబానికి వెంకట్‌రెడ్డి చెక్కు ఇచ్చారు. అశోక్‌బాబు, నర్సింహులు, అజీ జ్, ఆరిఫ్, కృష్ణయ్య గౌడ్, పవన్, ఖాదర్, గౌస్, తదితరులున్నారు.

బీసీలకు రిజర్వేషన్ల నిర్ణయం చరిత్రాత్మకం

షాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయమని సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి బీసీలను బీఆర్‌ఎస్ పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పుడు బీసీలకు రిజర్వేషన్లపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఆత్మగౌరవం కల్పిస్తూ అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందన్నారు. రాజకీయంగా బీసీలు ఉన్నత స్థానంలో నిలిచేందుకు రిజర్వేషన్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

చేవెళ్ల, జూలై16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఎంఈవో పురందాస్ తెలిపారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీబీవీని ఎంఈవో సందర్శించారు. యూడైస్‌కి సంబంధించిన ఆన్‌లైన్ వర్క్ విషయాలను, విద్యార్థులు రాసిన బేస్‌లైన్ ప్రశ్నపత్రాలను తరగతులవారీగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన భోజనంతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని టీచర్లకు సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.

THE COURT OF THE HON'BLE HIGH COURT FOR THE STATE OF TELANGANA: AT HYDERABAD
W.P.No.46883 of 2022

Between:
Abdul Rasheed Khan (died) per LR's ...Writ Petitioners
AND
The state of Telangana and others ...Respondents
To,

R13:- Vijaya Mareddy W/o. Krishna Reddy Marredy, Aged about 45 years, Occ: Business, R/o. Villa No. 167, Maple Town, Bandlaguda Jagir, Glendale School, Sikinderguda, R.R.Dist, T.S. 500 086.

R33:-Goli Madhurika, W/o. E. Srinivas Reddy, Aged about 46 years, Occ: Business, R/o. Flat No. A304, Jayabheri Orange County, Gachibowli, R.R.Dist, T.S. 500 032.

R38:- Billakanti Venkatesh, S/o. Billakanti Ramarao, Aged about 38 years, Occ: Business, R/o. Flat No. 307, KSN Hallmark residency, Sy.No.56, Shilpa Park, Maharshi Vidya Mandir School, Kondapur, Serilingampally, R.R.Dist, T.S. 500 084.

R46:- Krishna Reddy Marredy, S/o. M. Vengala Reddy, Aged about 52 years, Occ: Business, R/o. Villa No.167, Maple Town, Bandlaguda Jagir, Hyderguda, Rajendranagar, R.R.Dist, T.S - 30.

R49:-Smt Chereddy Jyoti, W/o. Dasaradha Rami Reddy, Aged about 50 years, Occ: Business, R/o. Plot No. 61, Maple Town, Bandlaguda Jagir, Glendale School, Sikinderguda, R.R.Dist, T.S. 500 086.

R57:- Sri Nanga Saikarthik Reddy, S/o. Nanga Subba Reddy, Aged about 39 years, Occ: Employee, R/o. H.No.12-2-124, Flat No.401, P & T Colony, Vijetha Srinivasa Paradise, Dilsukh Nagar, Saroornagar, R.R.District-500 060.

The above mentioned persons are hereby informed that our client Abdul Rasheed Khan (died) per LR's & others have filed W.P.No.46883/2022 before the Hon'ble High Court of Telangana against the technical approval granted by the 2nd respondent therein in favor of the 5th respondent therein to an extent of Ac.2.19 gts or 10,079.07 Sq.Mts. of land situated in Plot No's. Open Land in Sy.No.296/LU of Puppalaguda(V), Gandipet (M), Ranga Reddy District vide. Proceeding No.039566/ZOA/C1/U6/HMDA/30092020, dt.19-07-2021 as illegal, arbitrary, unjust and violative of Sec. 19(2) of the HMDA Act and set aside the same, and the matter is posted to 22-07-2025 for appearance of the above mentioned persons. Therefore, you may appear either in person or through advocate before the Hon'ble High Court on 22-07-2025 or else the matter will be proceeded by the Hon'ble Court in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/-M.R.S. SRINIVAS, C.PRAVEEN GOUTHA VINAY, Advocates
#12-2-416/34, Ushodaya Colony, Gudimalkapur, Mehdipatnam, Hyderabad-500 028, Cell: 9848015645

విస్తరణ వేగం.. ప్రగతికి దూరం

(ఐదో పేజీ తరువాయి)

పూర్తి స్థాయిలో లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు అంతర్గత రోడ్లపై నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. సీసీ రోడ్లు లేక అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల కాలి నడకకు కూడ కష్టంగా మారాయి. అన్ని అంతర్గ రోడ్లను సీసీగా ఏర్పాటు చేయాలని ఏళ్ల కాలంగా స్థానికులు మున్సిపాలిటీని కోరుతున్నా స్పందన లేదు. కాలనీ మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. నల్లా కనెక్షన్లు లేక సొంత బోర్ల నీటినే వాడుకుంటున్నారు. పైపులైన్ నిర్మాణం చేపట్టినా కనెక్షన్ ఇవ్వక నీరందడం లేదు. కాలనీలో వీధి దీపాలు కూడ చాలా చోట్ల లేక రాత్రి వేళల్లో స్థానికులు బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. కాలనీ ఇళ్ల మధ్య నుంచి 11కేవీ విద్యుత్ లైన్ ప్రమాదాన్ని పొంచివుంది. లైన్‌ను మార్చాలని స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కాలనీని సందర్శించి పలువురు ప్రజా ప్రతినిదులు, మున్సిపాలిటీ అధికారులు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదు. గ్రామీణ ప్రజలకు ఉన్న వసతులు కూడ మున్సిపాలిటీలోని వార్డులో కల్పించకపోవడం విమర్శలకు తావిస్తుంది. మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకొని విద్యానగర్ కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య పందుల స్వైర విహారం

ఇబ్బందులు పడుతున్నాం



ఏళ్ల కాలంగా సమస్యలతో సతమతమవుతున్నాం. కాలనీలో వసతులు కల్పించి ఇబ్బందులు తొలగించాలని అనేక మార్లు స్థానిక, ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా స్పందన లేదు. జాతీయ రహదారిని అనుసరించి ఉన్న విద్యానగర్ కాలనీలో వసతులు లేక ఇళ్ల అద్దెకు కూడ ఎవరు రావడం లేదు. సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తీర్చాలి.

- వర్కాల శేఖర్, కాలనీవాసి, విద్యానగర్

చేపపిల్లల జాడేది?

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న కొర్రమీను లాంటివి కాకుండా బొచ్చ, రవ్వ చేప పిల్లలను మాత్రమే చెరువులు, కుంటల్లోకి వదులుతున్నారు. మత్స్య శాఖ అందించే చేప పిల్లలను ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకొస్తారు. అయితే చెరువుల్లో చేప పిల్లలను వదలకుండానే పంపిణీ చేసినట్లు రికార్డుల్లో చూపుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. గతేడాది జిల్లా మత్స్యశాఖ జిల్లా అధికారిగా పనిచేసిన సుకీర్తి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆమెపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు విధించింది.

చెరువు సైజును బట్టి పంపిణీ

చెరువు విస్తీర్ణంలో 50 శాతం విస్తీర్ణాన్నే పరిగణంలోకి తీసుకుంటారు. సీజనల్ వారీగా నీరు లభ్యత ఉండే చెరువుల్లో ఎకరానికి తక్కువ సైజు ఉన్న మూడు వేల చేప విత్తనాలను వదులుతారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే చెరువుల్లో 80-10 మి.మి సైజు ఉన్న విత్తనాలను ఎకరానికి 2 వేలు వేస్తారు. చేప కిలో సైజ్ పెరగాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలైలో వదిలితే డిసెంబర్ నుంచి రెండు, మూడు నెలలపాటు వాటిని పట్టి విక్రయించవచ్చు. సెప్టెంబర్‌లో వదిలితే చేప కిలో సైజు పెరగాలంటే ఫిబ్రవరి వరకు ఆగాల్సిందే. ఇంకా పెరగాలంటే వేసవి వస్తుంది. ఆ సమయంలో ఎండ తీవ్రతకు చేపలు చనిపోతాయని మత్స్యకారులు అంటున్నారు.

186 సహకార సంఘాలు

జిల్లాలో 186 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా వీటిలో 162 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 18 ఉన్నాయి. అలాగే మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలు ఆరు ఉన్నాయి. వీటిలో 9,136 మంది సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ఈ ఏడాది చేప విత్తనాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం. ప్రభుత్వ ఆదేశాలు రాగానే టెండర్ ప్రక్రియ చేపట్టి చెరువుల్లో చేప పిల్లలను వదులుతాం.

- పూర్ణిమ, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఘనంగా పోచమ్మ బోనాలు



మొయినాబాద్ : కేతిరెడ్డిపల్లిలో బోనాల ఊరేగింపు

మొయినాబాద్/షాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి కేతిరెడ్డిపల్లిలో బుధవారం పోచమ్మ బోనాలు కనుల పండువగా నిర్వహించారు. గ్రామస్థులు ఆషాఢ బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ ఎంపీటీసీ అర్చన యాదయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు. షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడలో బంగారు మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు చల్లంగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.



షాబాద్ : తిమ్మారెడ్డిగూడలో ఆలయానికి తరలిన మహిళలు

బీజేపీ చీఫ్‌కు శుభాకాంక్షల వెల్లువ



యాచారం : రాంచందర్‌రావును సత్కరిస్తున్న న్యాయవాదులు

తలకొండపల్లి/యాచారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటకు చెందిన బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు ఇమ్మడి మహేశ్ బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే రాంచందర్‌రావును నగరంలోని కొత్తపేటలో గల రంగారెడ్డి జిల్లా కోర్టులో జిల్లా న్యాయవాదులతో పాటు యాచారం మండలానికి చెందిన పలువురు న్యాయవాదులు ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. న్యాయవాదులు విజయ్ నాయక్, పి.శ్రీశైలం, ముద్దం వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్స్ పార్క్ సొసైటీ సభ్యులపై చర్యలు తీసుకోండి

- నందిమ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన రైతులు

నందిగామ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని తమ వద్ద తక్కువ ధరకు భూములు తీసుకొని, తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి టెక్స్‌టైల్స్ ఏర్పాటు చేయకుండా మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నర్సప్పగూడ, చేగూర్ గ్రామాల రైతులు కోరారు. ఈమేరకు వారు బుధవారం నందిగామ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. తమను మోసం చేసిన టెక్స్‌టైల్స్ పార్క్ సొసైటీ సభ్యులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. సొసైటీ చైర్మన్ ఉప్పల నర్సయ్య, ఇతర డైరెక్టర్లపై కేసు నమోదు చేయాలని నందిగామ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా సొసైటీ సభ్యులు తమపై కేసులు పెడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు ధారూరు మల్లప్ప, సతీష్, రమేష్, ఆంజనేయులు, అర్జునయ్య, చంద్రశేఖర్, పెంటయ్య, రాములు, భారతమ్మ, యాదయ్య, లక్ష్మమ్మ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

షాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లోకి రావాలని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేందర్ అన్నారు. నాగర్‌కుంట గ్రామ పంచాయతీ యూత్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ ఎన్నుకొని నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, భాస్కర్, నర్సింహులు, శివయ్య, శివరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేపట్టాలి



సీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో సీపీవోను స్థానిక నేతలతో కలిసి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి లేక రోగులు, రోడ్డు ప్రమాద బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. సకాలంలో వైద్యం అందక అనేక మంది మృతి చెందారని పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ జోగు వీరయ్య, నాయకులు యాదయ్యగౌడ్, బాలకృష్ణ, పర్వతాలు, వంశీ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

చేవెళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం బోనాల సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పోచమ్మ దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మించేందుకు చేవెళ్ల పట్టణానికి చెందిన పెంజర్ల నర్సింహరెడ్డి, అనంతరెడ్డి(బొట్టు) సోదరులు ముందుకువచ్చారు. ఈ మేరకు బుధవారం అనంతరెడ్డి సొంత డబ్బులతో సీసీ రోడ్డు వేయించే పనులు ప్రారంభించారు. చేవెళ్ల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు. పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, పాండురంగారెడ్డి, డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, రాంరెడ్డి, మంగలి రాజు, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

చౌదరిగూడ : కొందుర్గు మండలం ఆగిర్యాలలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే ఆగిర్యాలలో జీపీ భవనానికి రూ.20 లక్షలు, తంగెళ్లపల్లి, ఉత్తరాస్‌పల్లి గ్రామాల్లో రూ. 24 లక్షలతో అంగన్వాడీ భవనాలకు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూక్‌నగర్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల మౌఖిక డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ ఫరూఖ్‌నగర్ మండల శాఖ డిమాండ్ చేసింది. బుధవారం ఎంఈవో మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు బి.సత్యం, బాలయ్య, నర్సింలు, కృష్ణయ్య, మహేష్, వెంకటయ్య ఉన్నారు.

షాబాద్ : దళారులు మట్టిని కొల్లగొట్టి డబ్బులు దండుకుంటే.. అధికారులు మాకు నోటీసులు ఇచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోలిపేటకు చెందిన రైతులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి గోడు వెల్లబోసుకున్నారు. సోలిపేట పరిధి సర్వేనెంబర్ 350లో భూమిని ప్రభుత్వం అసైన్ చేసింది. ఇందులో నుంచి దళారులు అక్రమంగా మట్టిని తరలించి అమ్ముకున్నారు. దాంతో అధికారులు అసైన్ చేసిన రైతులకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. చేవెళ్ల ఆర్డీవోతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తానని మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామస్తులు జనార్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విఠల్, తదితరులు ఉన్నారు.

షాబాద్ : డెయిరీ నిర్వహణతో అధిక లాభాలు పొందవచ్చునని పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ కె.కిషన్‌కుమార్ అన్నారు. బొబ్బిలిగామలో యూనివర్సిటీ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో డెయిరీ నిర్వహణ, పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్ కొండల్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సాహిత్యరాణిలు మాట్లాడుతూ పాల ఉత్పత్తి ద్వారా కోవా, వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై రైతులకు క్లుప్తంగా వివరించారు. భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు యాదవరెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేష్, గ్రామస్తులున్నారు.

షాద్‌నగర్ అర్బన్ : పర్యావరణ పరిరక్షణ కోసం అవకాశం ఉన్న ప్రతీ ప్రాంతంలో మొక్కలను నాటి, సంరక్షించాలని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఎ.మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లయన్ ఎంవీఎస్ రంగయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం కిషన్‌నగర్ శివారులోని వేద పాఠశాల విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మహేశ్వరం : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఎదురులేని శక్తిగా తయారు చేసేందుకు పార్టీ అనుబంధశాఖలన్నీ శక్తి వంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మహేశ్వరం గ్రామానికి చెందిన స్వరణగంటి సుభాష్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ సంస్థాగత సమన్వయకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కందుకూరు : దొంగతనం చేసిన వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లకు సీఐ సీతారాం నగదు రివార్డు అందజేశారు. జబ్బార్‌గూడకు చెందిన లక్ష్మి ఇంట్లో ఇటీవల బంగారుం, వెండి ఆభరణాలు దొంగిలించారు. క్రైం కానిస్టేబుల్ పాండురంగారెడ్డి, పెట్రోలింగ్ కానిస్టేబుల్ ఎం.రమేష్‌లు దుండగులను రెండురోజుల్లో పట్టుకున్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఫరూఖ్ నగర్ రంగారెడ్డి జిల్లా

సీల్డ్ వేలం ప్రకటన

తేది: 16.07.2025

మండల ప్రజా పరిషత్ ఫరూఖ్ నగర్ కార్యాలయ దుకాణముల సముదాయములోని (1A, 13A, 16A, 17A) నెంబరు గల (4) దుకాణములను అద్దెకు ఇచ్చుటకు తేది: 26.07.2025న సీల్డ్ వేలము ద్వారా కేటాయింపు చేయబడును.

ఇట్టి వేలములో పాల్గొనదలచినవారు రూ.లు.1,000/- (దరఖాస్తు రుసుము) ఏదేని స్థానిక జాతీయ బ్యాంకు నుండి MPDO, M.P.P Farooqnagar గారి పేర డిమాండు డ్రాఫ్టు చెల్లించి తేది: 17.07.2025 గురువారం నుండి దరఖాస్తు మం.ప్ర.ప.కార్యాలయము ఫరూఖ్ నగర్ నందు పొందగలరు. దరఖాస్తులు స్వీకరించుటకు చివరి తేది: 25.07.2025 శుక్రవారం మధ్యాహ్నం 3.00 గం.వరకు. సీల్డ్ టెండరు తెరుచు సమయం 26.07.2025 ఉ.11.00 గం.కు. స్థలము: మండల ప్రజా పరిషత్ ఫరూఖ్ నగర్.

ఇతర పూర్తి వివరములకు కార్యాలయ వేళలలో అన్ని పని దినముల యందు మండల ప్రజా పరిషత్ కార్యాలయము, ఫరూఖ్ నగర్ నందు సంప్రదించగలరు. ఫోన్ నం: 9441947364

సం/- మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్,
ఫరూఖ్‌నగర్

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

కేశంపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల గ్రామంలో గ్రామకంఠం స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని, వాటిని తొలగించాలని కోరుతూ బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్యకు అల్వాల గ్రామానికి చెందిన తిరుమల్‌రెడ్డి శ్రీనివాస్, భట్టు శంకర్, రామచందర్, మంగళి మహేష్, చెన్నయ్యలు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సుగుణమ్మ ఆమె కుటుంబ సభ్యులు గ్రామకంఠం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బాల్‌రాజ్

ఇబ్రహీంపట్నం, జూలై 16(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ ఇబ్రహీంపట్నం 34వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా పండగ బాల్‌రాజ్, కార్యదర్శిగా అయినాల కుమార్, కోశాధికారిగా కర్రె శశిధర్, పీఆర్‌వోగా కేవీ రమేష్‌రాజుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

ఆమనగల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తాటి చెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మాడ్గుల మండలం నల్లవారిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నల్లవారిపల్లికి చెందిన గజ్జె చంద్రయ్య(50) కల్లు తీయడానికి ఈనెల 11న తాటి చెట్టు ఎక్కాడు. ఈక్రమంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రయ్యగౌడ్ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సత్యమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రయ్యగౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- ఏడున్నర తులాల బంగారం, 15 తులాల వెండి.. రూ.10 వేల నగదు అపహరణ

చేవెళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కె.శాంతయ్య, భార్య లలిత, ఇద్దరు కూతుళ్లతో కలిసి ఈనెల 14న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మంగళవారం రాత్రి వచ్చి చూడగా ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న ఏడున్నర తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.10వేలు అపహరించినట్లు గుర్తించిన బాధితులు చేవెళ్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

గుండెపోటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి

చేవెళ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కమ్మెట మాజీ ఉప సర్పంచ్ కృష్ణగౌడ్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బుధవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించి, కృష్ణగౌడ్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కృష్ణగౌడ్ సీనియర్ నాయకుడిగా చురుకైన పాత్ర పోషించాడని గుర్తుచేశారు. అకాల మరణం పార్టీకి తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

దాయాదుల భూ వివాదం.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

ఆదిభట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో దాయాదుల మధ్య భూవివాదం నెలకొంది. కొంగరకలాన్ (ఫిరోజ్‌గూడ) రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 44, 45, 46లలో నీళ్ల శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు 4ఎకరాల 2గుంటల భూమి ఉండగా, ఇవే సర్వేనంబర్లలో తమకు భూమి ఉందని నీళ్ల ప్రభాకర్‌గౌడ్ సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ సర్వేయర్ శ్రీనివాస్ బుధవారం ఫిరోజ్‌గూడలోని సర్వేనంబర్లు-44,45లలో సర్వే చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు సర్వేయర్ శ్రీనివాస్ దగ్గరకు చేరుకొని రైతులమైన మాకు నోటీసులు జారీ చేయకుండా సర్వే ఎలా చేస్తున్నారని నిలదీయడంతో సర్వేయర్ శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాంతో అక్కడే ఉన్న ఇరువర్గాల వారు తిట్టుకున్నారు. మాటా మాట పెరిగి గొడవ పడ్డారు. ప్రభాకర్‌గౌడ్ వర్గం వాళ్ల శ్రీకాంత్‌పై దాడి చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతవరణం నెలకొంది. అక్కడున్న ఇతర రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై వెంకటేష్ చేరుకున్నారు. ఇరువర్గాల వారితో మాట్లాడి గొడవ సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. భూవివాదంలో గాయపడిన శ్రీకాంత్‌గౌడ్ ఆదిభట్ల పోలీసులకు ప్రభాకర్‌గౌడ్ మరికొంత మందిపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఆమనగల్లులో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు కృషి : ఎంపీ మల్లు


ఆమనగల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. సీఎస్‌ఆర్ నిధులతో పాఠశాల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం రాత్రి మల్లు రవి పర్యటించారు. కాంగ్రెస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గూర్చి చర్చించారు. రవి మాట్లాడుతూ మాడ్గుల రోడ్డులోని శిథిలావస్థకు చేరిన బీసీ పాత భవనం స్థానంలో రెసిడెన్షియల్ పాఠశాల భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. సీఎస్‌ఆర్ నిధులతో రూ. 5 కోట్లతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట

కందుకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు ఏఎంసీ డైరెక్టర్ పుష్పదర్శన్, ప్యాక్స్ డైరెక్టర్ సాధ పాండురంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని నేదునూరులో 111 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులతో పాటు కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పథకాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, చెన్నకేశవులు, రూప్‌చందర్, బి.సురేష్, రాకేష్ గౌడ్, సంజీవ, బాబు, సంజీవ, తదితరులు పాల్గొన్నారు,

మాకు న్యాయం చేయండి


- రియల్ ఎస్టేట్ వ్యాపారి వైఖరిపై రైతుల వేడుకోలు



అప్పారెడ్డిగూడ శివారులోని భూమిలో వరినాట్లు వేస్తున్న రైతులు

నందిగామ, జూలై 16(ఆంధ్రజ్యోతి): భూమిని అగ్రిమెంట్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, అమ్ముకున్న భూమిలో రైతులు వరినాట్లు వేసిన సంఘటన బుధవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. .ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన పట్టెల రామయ్య, అతడి సోదరులకు నందిగామ మండలం అప్పారెడ్డిగూడ శివారులో 13 ఎకరాల 22 గుంటల పొలం ఉంది. రామయ్య కుటుంబ సభ్యులు 2024లో హైదరాబాద్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి కొన్ని డబ్బులు తీసుకుని అగ్రిమెంట్ చేశారు. సంవత్సరం దాటినా మిగతా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా వారిని భూమిలోకి రానివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పొలంలో వరినాట్లు వేసి తమకు న్యాయం చేయాలని కోరారు. రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు పోలీసులను ఆశ్రయించారు.

కొటారి నిర్మలకు పీహెచ్‌డీ ప్రదానం



నిర్మలతో వీసీ డాహెచ్ఎస్ సైనీ

ఇబ్రహీంపట్నం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గురునానక్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కొటారి నిర్మల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. వైస్ చాన్సలర్ డా.హెచ్.ఎస్. సైనీ బుధవారం ఆమెను అభినందించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ఆమె కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో సమ్ స్టడీస్ ఆఫ్ అథెంటికేషన్ అండ్ ప్రైవసీ ఇష్యూస్ ఆఫ్ మెడికల్ డేటా ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్ అనే అంశంపై పరిశోధనను ప్రొఫెసర్ డా.ఎస్.ఉషారాణి పర్యవేక్షణలో థీసిస్‌ను యూనివర్సిటీకి సమర్పించారు.